# 10. రగతం

ఒక అబ్బాయి వొక అమ్మాయిని ప్రేమించాడు. ఆ అమ్మాయి మరో అబ్బాయిని ప్రేమించింది.

అతడు ఆ అమ్మాయి తన్ను ఎందుకు ప్రేమించ లేదో అని ఆలోచించాడు. అలా ఆలోచించి, ఆలోచించి, ఆ డబ్బున్న అమ్మాయి ఆ డబ్బున్న అబ్బాయినే ప్రేమించగల్గిందని తెల్సుగున్నాడు.

ఆ విఫల ప్రేమలో అతడి హృదయం మండింది. మనసు మండింది. అప్పుడు ఆ అబ్బాయి తన భగ్న ప్రేమ మంటల్ని తన సోదర విద్యార్థులకు చెప్పుగున్నాడు. విల విలా ఏడ్చాడు. జలజలా కన్నీరు కార్చాడు.

ఓ రోజు సాయంకాలం - ఆ ప్రేమికులు కార్లో ఉల్లాసంగా, వెళుతున్నారు. అప్పుడు ఆ భగ్న ప్రేమికుడూ - అతని సోదర విద్యార్థులూ - చెట్టు చాటున నిలబడ్డారు. అలా నిలబడి, బుల్లి బుల్లి రాళ్లు ఆ కారు మీద విసిరారు. ఆ కారు అద్దాలే పగిలాయ్. అతడు తప్పించుగుని, రివ్వున వెళ్లిపోయాడు. అప్పుడు అతడు అలా వెళ్లి, రివ్వున మరి కొందరితో తిరిగి వచ్చాడు.

అలా వాళ్లు, రాళ్లు రివ్వు రివ్వున విసురు గుంటున్నారు. అప్పుడు పోలీసులు వచ్చారు. అలాగే మరి కొందరు కుర్రాళ్ళు కూడా చేరారు.

అలా అప్పుడు చిన్న సంఘర్షణ జరిగింది. చిన్న దెబ్బలాట జరిగింది.

ఆ కుర్రాళ్లకి రాళ్లు విసరడమే గానీ లాఠీలు తిప్పడం రాదు.

ఆ విధంగా - ఆ వేళ - అక్కడ - - -

హింస జరిగింది.

కన్నీరు కురిసింది.

రగతం పారింది.

* * *

ఓ రోజు రాత్రి, యవ్వనంలో వురకలు వేస్తున్న వో విద్యార్థి సినీమా చూడ్డానికి వెళ్లాడు.

ఆ బొమ్మలో - -

మల్లెలు మత్తుగా నవ్వాయ్.

గులాబీలు కవ్వింపుగా చూసాయ్.

చేమంతులు పచ్చగా పలకరించాయ్.

ఆ అమ్మాయి ఆ బొమ్మలో – –

ఆ మల్లెల్లా మత్తుగా నవ్వింది.

ఆ గులాబీల్లా ఎర్రగా పూసింది.

ఆ చేమంతుల్లా పచ్చగా, వెచ్చగా, పలకరించింది.

ఆ నవ్వుల్లో - ఆ పూతల్లో- ఆ చూపుల్లో-ఆ పలకరింపుల్లో- ఆ బొమ్మలోని హీరో వూగి వూగి, వురకలు వేసాడు!

అప్పుడు ఆ సినిమా చూస్తున్న ఆ విద్యార్థి వొళ్ళు పులకరించింది. ఆ పులకరింపుల్లో, కాళ్ళు పొడవుగా ముందుకు సాచాడు. చేతులు పైకెత్తి వొళ్ళు విరుచుగున్నాడు.

అప్పుడు ఆ విశ్వ విద్యాలయం విద్యార్థి కాలి వేళ్ళే గాకుండా, చేతి వేళ్లు గూడా ఓ సుందరాంగి చీర కొంగుకు తగిలాయ్. అప్పుడు ఆమె వెన్కక్కి తిరిగి, పన్నీరులా చల్లగా చిరునవ్వు నవ్వింది.

ఆమె భర్త ఆమె భుజం మీద చేయ వేసి, కూర్చున్నాడు. అతడు అది చూసాడు. భగ్గున మండి పోయాడు. తన వర్కర్ను పిలిపించాడు.

పన్నీరు లాంటి చల్లని అమె చిరునవ్వుని దొంగిలించిన ఆ విద్యార్థిని అవమానించాడు. **అంతే** గాకుండా, తన్నించి, అతడి బట్టలు చింపించాడు.

ఆ విద్యార్థి ఆ అవమానంతో అగ్నిలా మండాడు. ఆ మంటల్ని విశ్వవిద్యాలయంలో వినిపించాడు.

విద్యార్థులు గుంపులు గుంపులుగా వచ్చారు. అతడి ఇల్లు చేరారు. ఆ ఇల్లూ - కార్లూ -లారీలూ - పెట్రోలు పోసి, తగల బెట్టారు.

పోలీసులు వచ్చారు. కొందరు పారిపోయారు. కొందరు దెబ్బలు తిని పారిపోయారు. కొందదు రాళ్ళు విసిరి, పారిపోయారు. కొందరు పారిపోతూ రాళ్ళు విసిరారు. కొందరు పారి పోకుండా, రాళ్ళు విసిరారు.

ఆ విధంగా -ఆ వేళ రాత్రి- అక్కడ

మంటలు మండాయి.

హింస జరిగింది.

కన్నీరు కురిసింది.

రగతం పారింది.

ఓ సారి వో ప్రాంతం వారు తమ ప్రాంతం వెనక బడి వుందనీ,ఆ ప్రాంతానికి అన్యాయం జరుగుతోందనీ, అంచాత ఆ ప్రాంతంలో ఒక పరిశ్రమ పెట్టమనీ ప్రభుత్వాన్ని కోరారు.

ఆ పరిశ్రమ అక్కడ పెట్టక పోతే, ఎంత మంది తమ పార్టీ నాయకులకు నష్టమో, పెడితే ఎంత మందికి నష్టమో, వారి వారి నష్టాలు తమకు ఎటువంటి కష్టాలు కలిగిస్తాయో, ఆ ప్రభుత్వం లెక్కలు వేసింది. ఎన్ని లెక్కలు వేసినా, అవి లాభసాటిగా కిట్టలేదు. అంచాత ఆ ప్రజల కోర్కెను పక్కకు పెట్టి, విశ్రాంతి తీసుగుంటోంది.

ఆ ప్రజలు చాలా కాలం ఆగారు. ఆగి ఆగి మరింక ఆగలేకపోయారు. శాంతి యుత సత్యాగ్రహాలు ప్రారంభించారు. నిరాహార దీక్షలు పట్టారు. పనులు మానేసారు. ఆఫీసులు మూసారు. స్కూళ్లూ - కాలేజీలూ - ఆసుపత్రులూ - మూసారు. బస్సులూ - రైళ్లూ ఆపారు. అలా ప్రజా జీవితం స్తంభించి పోయింది.

ఆ తర్వాత వాహనాల దహనం ఆరంభించారు. అలాగే ఆఫీసుల దహనం ప్రారంభించారు.

అప్పుడు సాయుధ దళాలు రంగం లోకి వచ్చాయ్.

ప్రజలు రాళ్ళు విసిరారు. రోడ్ల మీద తారు డబ్బాలు అడ్డుగా పెట్టారు. ఆస్తుల్ని కాల్చారు. కొందరు ప్రజలు జైళ్ళల్లోకి వెళ్లారు. కొందరు లాఠీ దెబ్బలు తిన్నారు. కొందరు తుపాకి గుళ్ళను తిన్నారు.

ఆ విధంగా - అప్పుడు - అక్కడ

ఆ శాంతియుత సత్యాగ్రహంలో -

మంటలు మండాయి.

హింస జరిగింది.

కన్నీరు కురిసింది

రగతం పారింది.

* * *

ఓ సారి వో ప్రాంతం వారు ప్రత్యేక రాష్ట్రం కావాలన్నారు. ఆ ప్రాంతానిక అన్యాయం జరుగుతోందని చెప్పారు. ఆర్థికంగా వెనబడిందని తెలియ జేసారు. ఆ ప్రాంతాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని చెప్పారు. అంచాత ప్రత్యేక రాష్ట్రం కోసం పట్టు పట్టారు.

అప్పుడు ఆ ప్రభుత్వం మళ్లీ లెక్కలు వేసింది. ప్రత్యేక రాష్ట్రం ఇస్తే ఎలాంటి నష్టాలు వస్తాయో - ఇవ్వక పోతే ఎలాంటి నష్టాలు వస్తాయో ఆలోచించింది. లెక్కలు వేసింది. బలాబలాలు

తూచింది. ఆ లెక్కలు కిట్టలేదు. ఆ తూకాలు కిట్టలేదు. అంచాత, ఆ ప్రజల కోర్కెను గాలిలో వుంచేసింది.

అప్పుడు ఆ ప్రజల ఆగ్రహాలు సత్యాగ్రహాలు అయ్యాయ్. ఆ ప్రజల కోపాలు నిరాహార దీక్షలయ్యాయ్. పాలనా సంస్థలు మూసారు. విద్యాలయాలు మూసారు. విద్యార్థులు వూరేగింపులు జరిపారు. ప్రభుత్వపు ఆజ్ఞల్ని నిరసించారు.

శాంతిని నెలకొల్పడానికి, సాయుధ దళాలు రంగంలోకి వచ్చాసాయ్.

ప్రజలు రెచ్చి పోయారు. ఆస్తుల్ని కాల్చారు. వాహనాల్ని మంట పెట్టారు. రాళ్ళు - సోడాబుడ్లు- గాజు సీసాలు- ఇనప గుళ్లు - గాలిలో పక్షుల్లా ఎగిరాయ్.

ఆ విధంగా - అప్పుడు - అక్కడ

మంటలు మండాయ్

హింస వుప్పొంగింది.

కన్నీరు కాల్వలై పారింది

రగతం వరదలై పారింది.

* * *

మరో సారి మన దేశంలో - - - -

- - - -

కథ పూర్తి కాలేదు!

(ఆంధ్ర జ్యోతి - సచిత్ర వార పత్రిక - 24-08-1975)